క్లుప్తంగా

ఎంటీఎంసీ లోగో రూపకల్పన పోటీలు



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగర పాలక సంస్థ లోగో డిజైన్ రూపకల్పనకు పోటీలను నిర్వహిస్తున్నట్లు ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా తెలిపారు. సోమవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో అలీమ్ బాషా మాట్లాడుతూ ఎంటీఎంసీ లోగో డిజైన్ రూపకల్పనకు ప్రతిభావంతులను భాగస్వామ్యం చేసేందుకు పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ప్రాముఖ్యతను, చరిత్రను తెలియజేసే విధంగా లోగో డిజైన్‌ను రూపొందించాలన్నారు. డిజైన్ చేసిన లోగోతో పాటు, డిజైనర్ చిరునామా, వివరాలను నవంబర్ 10 లోపు పంపాలని, ప్రతిభ కనబర్చిన వారికి రూ.10 వేల నగదు బహుమతి అందజేయబడుతుందన్నారు. ఆసక్తి గల వారు పాల్గొనవచ్చన్నారు.

వ్యాధులపై ప్రజలకు అవగాహన



ఫిరంగిపురం: పలు రకాల వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యురాలు శాంతి చెప్పారు. మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో సోమవారం ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఫిరంగిపురం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యురాలు శాంతి 132 మందికి పలు రకాల పరీక్షలు చేశారు. నెలకు సరిపడా మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్‌సీడీసీడీ ప్రోగ్రాం త్వరలో ప్రారంభిస్తారన్నారు. దానిలో భాగంగా నోటి క్యాన్సర్, గర్భ సంచి, బ్రెస్ట్ క్యాన్సర్లను వివరించారు. వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీ సాగర్‌రాణి, ఏఎన్‌ఎం సరోజ, మేల్ అసిస్టెంట్ బాబావలి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రతిభ కనబర్చిన తాడేపల్లి విద్యార్థులు



తాడేపల్లిరూరల్: గుంటూరులో జరిగిన జిల్లా స్థాయి చెకుముకి టాలెంట్ టెస్ట్‌లో తాడేపల్లి జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మూడవ స్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు తాతిరెడ్డి విద్యార్థులను అభినందించారు. అనంతరం తాతిరెడ్డి మాట్లాడుతూ గుంటూరు హిందూ ఇంజినీరింగ్ కాలేజ్ ఆవరణలో ఆదివారం జిల్లా వ్యాప్తంగా వివిధ స్కూళ్ల నుంచి 40 బృందాలు రాత పరీక్ష, క్విజ్ పోటీలో పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో తమ విద్యార్థుల బృందం హర్షిణి(10వ తరగతి) అఖిల(9వ తరగతి), మణికంఠ (8వ తరగతి) ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సాధించారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను, సహకరించిన ఉపాధ్యాయులను అభినందించారు.

కంటి వైద్య ఉచిత శిబిరం



తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని డోలాస్ నగర్‌లో సోమవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దళిత నాయకులు వేమూరి మైనర్‌బాబు విచ్చేశారు. వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ సంధ్య కంటి ఆసుపత్రి సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. కంటి సమస్యలు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారని చెప్పారు. ఉచితంగా కంటి ఆపరేషన్లను సంధ్య కంటి ఆసుపత్రి వైద్యులు నిర్వహిస్తారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో జన చైతన్య ప్రచార కమిటీ అధ్యక్షుడు మాచర్ల ఏసోబు, సంధ్య కంటి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెనాలి ఏసీపీగా శివన్నారాయణ

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా టి.శివన్నారాయణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన సీఆర్‌డీఏ నుంచి బదిలీపై వచ్చారు. గతంలో తెనాలిలో ఏసీపీలుగా పనిచేసిన సుధాకర్ ఒంగోలు మున్సిపల్ కార్పొరేషన్‌కు, సుబ్బారావు సీఆర్‌డీఏకు బదిలీ అయిన విషయం తెలిసిందే. బాధ్యతలు స్వీకరించిన అనంతరం చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, కమిషనర్ బండి శేషన్న, అసిస్టెంట్ కమిషనర్ వీ.ఎం.లక్ష్మీపతిలను మర్యాదపూర్వకంగా కలిశారు.

వెల వెలపోయిన పత్తి

- చేతికందొచ్చిన పత్తి పంట
- ప్రభుత్వ మద్దతు ధర క్వింటా రూ.7,521లు
- బహిరంగ మార్కెట్‌లో రూ.5 వేలు పలకని వైనం
- ప్రారంభం కాని కొనుగోలు కేంద్రాలు
- దళారులు చెప్పిందే ధర..
- పెట్టుబడులు కూడా రావంటున్న రైతులు



పత్తి తీసేందుకు సిద్ధంగా పంట

తాడికొండ: ఆరుగాలం శ్రమించి పంట పండించే రైతుకు ఏటా ఏదో ఒక రూపంలో ఎదురు దెబ్బలు తప్పడం లేదు. గతేడాది అధిక వర్షాలు నిలువునా ముంచితే.. ఈ ఏడాది ఖరీఫ్‌లో తుపానులు, అల్పపీడనాలు నిండా ముంచాయి. ఎలాగోలా తేరుకుని పత్తి పంటను రైతులు నిలబెట్టుకున్నారు. ఇప్పుడు పంట చేతికందే సమయానికి ధరలు ఉల్టా పల్టా అయ్యాయి. గతేడాది పత్తి ధర బహిరంగ మార్కెట్లో ఆశాజనకంగా ఉండటంతో ఈ ఏడాది తాడికొండ మండలంలో 15 వేల ఎకరాలు, తుళ్ళూరు మండలంలో 3,500 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేపట్టారు. ఈ ఏడాది పత్తి పంట కనీస మద్దతు ధర క్వింటాకు రూ.7,521లు ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో తమకు గిట్టుబాటు అవుతుందని రైతులంతా ఆనందం వ్యక్తం చేశారు.

పట్టించుకోని ప్రభుత్వం

రైతులకు అండగా నిలవాల్సిన కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పత్తికి రూ.5 వేలకు మించి ఒక్క రూపాయి కూడా అదనంగా ఇచ్చే పరిస్థితి లేదని రైతులు వాపోతున్నారు. బహిరంగ మార్కెట్లో దళారీ వ్యవస్థ చేరి తొక్కిపట్టడంతో పూర్తిగా తగ్గి.. నిలువునా ముంచిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ కేంద్రాల ద్వారా పత్తిని రైతుల నుంచి కొనుగోలు చేయాల్సిన ప్రభుత్వం అసలేమీ పట్టనట్లు వ్యవహరిస్తుండటంతో ఈ ఏడాది పత్తి రైతుల పరిస్థితి అడకత్తెరలో పోకచెక్కలా మారింది. నిల్వ చేసుకుంటే రంగుమారి అసలుకే ప్రమాదం వచ్చే పరిస్థితి ఉండటం, విక్రయిద్దామంటే.. ధరలు చతికిలపడటంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐ ద్వారా కొనుగోలు చేస్తామని ఆర్భాటంగా ప్రకటించిన ప్రభుత్వం వాటిని రైతులకు అందుబాటులో కాకుండా ఎక్కడో స్పిన్నింగ్ మిల్లులు కేంద్రంగా కొనుగోలుకు రావాలని ప్రకటన జారీ చేయడం విశేషం.

గతంలో ఇలా..

గతంలో సీసీఐల ద్వారా స్థానికంగా వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసేవారు. రైతులు అక్కడకు సరుకు తీసుకొచ్చిన తర్వాత పాసింగ్ చేసి, నాణ్యతను బట్టి ధర నిర్ణయించేవారు. కానీ ఈ ఏడాది మాత్రం రైతులు సీసీఐ కేంద్రాలకు విక్రయించాలంటే నేరుగా సంబంధిత స్పిన్నింగ్ మిల్లు వద్దకు సరుకును తీసుకొని వెళ్లాలి. సీసీఐ బయ్యర్, సూపర్‌వైజర్ అక్కడ ధరలను నిర్ణయిస్తారని ప్రకటించారు. అసలే పెరిగిన వ్యవసాయ పెట్టుబడి ఖర్చులు, కూలీలకు చెల్లింపులు తడిసిమోపెడు అవుతుంటే.. మళ్లీ ప్రైవేటు వాహనంలో సరుకును తరలించాల్సి రావడం నిలువునా ముంచేందుకే అని అంటున్నారు. తేమ శాతం పేరుతో సీసీఐ బయ్యర్లు పంటను తిరస్కరిస్తే తమ పరిస్థితి ఏంటని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు తక్షణమే స్పందించి రైతులకు సీసీఐ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చి మద్దతు ధరకు కొనుగోలు చేయడం ద్వారా దళారీ వ్యవస్థను అదుపులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందని కోరుతున్నారు.

దళారీ వ్యవస్థతో నష్టం



వాతావరణ ఒడిదుడుకులకు నిలదొక్కుకుని పంటను కాపాడుకున్నాం. పంట చేతికొచ్చే సమయానికి ప్రభుత్వం మద్దతు ధరలు లేకుండా.. దళారీ వ్యవస్థను పోత్సహించేలా వ్యవహరించడం మంచిది కాదు. సీసీఐ కేంద్రాల ద్వారా మద్దతు ధరకు పత్తిని కొనుగోలు చేస్తే తప్ప ఈ ఏడాది రైతులు కోలుకునే పరిస్థితి లేదు.

– పరుచూరి నారాయణ, రైతు

పెట్టుబడి ఖర్చులు రావడం లేదు



సీసీఐ కేంద్రాలు తెరిచి, ప్రభుత్వం కొనుగోలు చేయని కారణంగా బహిరంగ మార్కెట్లో దళారీ వ్యవస్థ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తోంది. ఈ ఏడాది పెరిగిన కౌలు, పురుగు మందులు, వ్యవసాయ ఖర్చులు రైతులకు తిరిగి రావాలంటే కనీస మద్దతు ధరకు ప్రభుత్వమే ప్రతి క్వింటా కొనుగోలు చేయాలి.

– చింతల భాస్కరరావు, రైతు సంఘం నాయకుడు

అక్రమ కేసులు సరికాదు

సీపీఎం తాడేపల్లి రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి



సిమెంట్ ఫ్యాక్టరీ భూముల్లో కర్రలు పాతిన కార్మికులు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధి బ్రహ్మానందపురంలోని ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు తమకు రావాల్సిన బకాయిల కోసం ఎదురుచూసి, చివరకు గత్యంతరం లేని పరిస్థితుల్లో భూముల్లోకి దిగిన కార్మికులపై, వారికి అండగా నిలిచిన కార్మిక నాయకులపై ఎన్‌ఆర్‌ఐ ప్రతినిధులు ఇచ్చిన తప్పుడు ఫిర్యాదుతో తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేయడం సరికాదన్నారు సీపీఎం తాడేపల్లి రూరల్ కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి. సోమవారం కార్మికులతో ఆయన మాట్లాడుతూ కోర్టు తీర్పు అమలు చేయమని కోరితే అక్రమ కేసులు పెడుతున్నారని, అన్యాయంగా తమపై పెట్టిన కేసులకు భయపడేది లేదన్నారు. సీపీఐఎంఎల్ నాయకులు స్వామి మాట్లాడుతూ సిమెంట్ ఫ్యాక్టరీ భూ పోరాటం మరింత ఉధృత చేస్తామన్నారు. సీపీఐ మంగళగిరి నియోజకవర్గ సహాయ కార్యదర్శి బూరుగ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పోలీసు అధికారులు కోర్టు తీర్పును అమలు జరపాలని, తీర్పును అమలు జరపని వారిపై కేసులు నమోదు చేయాలన్నారు. కానీ, న్యాయంగా అడిగిన తమపై కేసులు నమోదు చేస్తున్నారని ప్రశ్నించారు.

నిండా ముంచిన అకాల వర్షాలు



తాడికొండ: ఖరీఫ్‌లో అన్నదాతలకు అడుగడుగునా అడ్డుకున్న అకాల వర్షాలు, రబీ సీజన్ ఆరంభంలోనూ తమ ప్రతాపాన్ని చూపించాయి. వాతావరణం అనుకూలంగా ఉండటంతో గత 20 రోజుల క్రితం రబీ సీజన్ కింద రైతులు వేలాది ఎకరాల్లో మినుము పంట సాగుకు శ్రీకారం చుట్టారు. వెద వేసిన వెంటనే అకాల వర్షాలు, అల్పపీడనం దెబ్బకు వరుసగా 15 రోజుల పాటు విడవకుండా కురవడంతో పరిస్థితి తారుమారైంది. నీరు నిలిచి మినుము పైరు ఎర్ర బారడంతో రైతులు పంటను కలియదున్నాల్సిన పరిస్థితి వచ్చింది. వందలాది ఎకరాల్లో పంటలను దున్నేస్తున్న తమను ఆదుకునేందుకు ప్రభుత్వం రాయితీపై ఎరువులు, విత్తనాలు అందజేసి రైతులను ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు.

దోమలతో అప్రమత్తంగా ఉండండి

జిల్లా మలేరియా అధికారి సుబ్బరాయణం



అవగాహన కల్పిస్తున్న సుబ్బరాయణం

తెనాలిఅర్బన్: దోమలతో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి తలాటం మురళీకృష్ణ సుబ్బరాయణం పేర్కొన్నారు. మలేరియాశాఖ ఆధ్వర్యంలో సుల్తానాబాద్, సుందరయ్యనగర్, చెంచుపేటలో సోమవారం ఇంటింటి సర్వే నిర్వహించి వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధుల వివరాలు నమోదు చేసేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమలు కుట్టకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం వచ్చిన వెంటనే సమీపంలోని ప్రభుత్వ వైద్యశాలలో చూపించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహాయ మలేరియా అధికార దారవత్ రాజునాయక్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, తెనాలి పట్టణ, మండల సబ్‌యూనిట్ అధికారులు శ్రీకంఠ ఉమాకాంత్, వంగాల పున్నారెడ్డి, శివ గణేష్, రవికుమార్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



తాడేపల్లిరూరల్: రోటరీ క్లబ్ ఆఫ్ తాడేపల్లి ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా తాడేపల్లి అధ్యక్షుడు రమేష్ బాబు, కార్యదర్శి సుకుమార్ మాట్లాడుతూ తాడేపల్లి, హైదరాబాద్ నార్త్ వెల్లాన్ ప్రాజెక్ట్ సంయుక్త సహకారంతో ఐదురుగు విద్యార్థులకు తాడేపల్లి బైపాస్ రోడ్డులోని గోపు హెచ్‌పీ పెట్రోల్ బంకు వద్ద సైకిళ్లు అందజేశామని తెలిపారు. ఇంటి నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణించి, పాఠశాలలో చదువుకునే విద్యార్థులకు ఈ సైకిళ్లను అందజేశామని తెలిపారు. తాడేపల్లి క్లబ్ సభ్యులు చంద్ర ఓబులా రెడ్డి, గోపు నాగరాజేష్, శెట్టి రామకృష్ణ పాల్గొన్నారు.

బడుగు వర్గాల విద్యాదాత పొన్నెకంటి మృదుభాషిణి

సంస్మరణ సభలో మంద కృష్ణమాదిగ, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు నివాళి



మృదుభాషిణికి శ్రద్ధాంజలి ఘటించిన మంద కృష్ణమాదిగ

తెనాలి: అట్టడుగు వర్గాల్లో విద్యావ్యాప్తికి ఎంతగానో కృషిచేసిన మంచి మనిషి పొన్నెకంటి మృదుభాషిణి చిరస్మరణీయులని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ అన్నారు. రూరల్ మండల గ్రామం కొలకలూరులో ఇటీవల మృతిచెందిన కరుణానిలయం విద్యాసంస్థల కరస్పాండెంట్ పొన్నెకంటి మృదుభాషిణి సంస్మరణ సభను సోమవారం అదే సంస్థ ఆవరణలో నిర్వహించారు. డీఎం లూథర్‌బాబు అధ్యక్షత వహించారు. మంద కృష్ణమాదిగ మాట్లాడుతూ ఓర్పు, నేర్పు, సహనానికి మారుపేరుగా, ప్రధానోపాధ్యాయినిగా మృదుభాషిణి ఎంతో పేరుప్రఖ్యాతులు సాధించారని చెప్పారు. వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మాట్లాడుతూ కరుణానిలయం కరస్పాండెంట్‌గా, ప్రధానోపాధ్యాయినిగా ఎందరికో విద్యను అందించారని గుర్తుచేసుకున్నారు. ఆమె భర్త పొన్నెకంటి నథానియెల్ ప్రేమచా గ్రామసర్పంచ్‌గా గ్రామాభివృద్ధికి ఎంతగానో శ్రమించినట్టు చెప్పారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, కుటుంబసభ్యులు పొన్నెకంటి మంజుల, పీబీ కరుణాకర్, పొన్నెకంటి ప్రత్యూష్, డాక్టర్ ప్రభావతి, పి.సుధీర్‌కుమార్ తమ ప్రసంగాల్లో మృదుభాషిణి ఉన్నత వ్యక్తిత్వాన్ని, విద్యాసంస్థల అభివృద్ధికి చేసిన శ్రమను స్మరించుకున్నారు. ఉపాధ్యాయులు ఎన్.వెంకటేశ్వరరావు, ఎ.లక్ష్మీసామ్రాజ్యం, జి.వెంకటేశ్వరరావు, అడిషనల్ ఎస్పీ శోభామంజరి, డాక్టర్ పద్మావతి, మాజీ సర్పంచ్ వల్లూరి వరప్రసాదరావు, వై.రవికిరణ్, ఎ.సుదీప్, సందీప్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు, పి.హేమలత, డాక్టర్ చైతన్య, డాక్టర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలుత అతిథులంతా మృదుభాషిణి చిత్రపటానికి, సమాధికి ఆమె కుటుంబసభ్యులతో కలిసి నివాళులర్పించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం

తెనాలిఅర్బన్: తెనాలి మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న తెలిపారు. ఉదయం 11.30 గంటలకు మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో జరిగే సమావేశానికి మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షతన వహిస్తారని చెప్పారు. సమావేశంలో కౌన్సిలర్‌లు, కో–ఆప్షన్ సభ్యులు, ఎక్స్ ఆఫీషియో సభ్యులు పాల్గొనాలని కోరారు.

ముగిసిన మహాదేవుని మహిమ పండగలు



తెనాలి: స్థానిక ఇస్లాంపేటలోని యేసయ్య ప్రార్థనా కొండ చర్చ్ లో ఈ నెల 24, 25, 26, 27 తేదీల్లో జరిగిన మహాదేవుని మహిమ పండుగలు ఆదివారం రాత్రితో ముగిశాయి. మహదేవుడైన ఏసుక్రీస్తు మార్గంలోకి రావడం ద్వారా హృదయాల్లో శాంతి, సౌభాగ్యాలు కలుగుతాయని పలువురు దైవ సేవకులు చెప్పారు. కన్వీనర్ బ్రదర్ ఆనందన్న పర్యవేక్షణలో జరిగిన ఈ పండుగల్లో రెవరెండ్ పల్లె శామ్యూల్, రెవరెండ్ ఎస్.చిట్టిబాబు, పాస్టర్ ఎం.సంసోను, పాస్టర్ జి.దానియేలు రాజు, పాస్టర్ దాసరి ప్రభుదాస్, ఎ.బోయజు, జి.ఐజక్ కుమార్, బ్రదర్ పి.ఛార్లెస్ వెస్లీ వాక్యోపదేశం చేశారు. పి.ప్రశాంత్ బాబు స్తుతి ఆరాధన క్రమం చేశారు. వాక్యోపదేశం చేసిన దైవ జనులను బ్రదర్ ఆనందన్న సత్కరించారు. అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

కేఎల్‌యూలో మానసిక ఆరోగ్యంపై అవగాహన సదస్సు



అనంతకుమార్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అసోసియేట్ డీన్ డాక్టర్ రమ్య

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో విద్యార్థి సంక్షేమ విభాగం ఆధ్వర్యంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్, వ్యాల్యూ ఎడ్యుకేషన్ విభాగాలు సంయుక్తంగా సోమవారం మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ మానసిక ఆరోగ్య నిపుణులు అనుమకొండ అనంతకుమార్ విచ్చేసి విద్యార్థుల జీవిత లక్ష్య సాధనలో మానసిక ఆరోగ్యం ఎలాంటి కీలక పాత్ర పోషిస్తుందో వివరించారు. హైకోర్టు న్యాయవాది పోలిశెట్టి సుభాషిణి జెండర్ సెన్సిటైజేషన అంశంపై విద్యార్థులకు విశదీకరించారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ, ప్రో వీసీ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ కేఆర్‌ఎస్ ప్రసాద్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ కన్వీనర్ రూతు రమ్య, వ్యాల్యూ ఎడ్యుకేషన్ సెల్ హెచ్‌ఓడీ డాక్టర్ పవన్‌కుమార్, కో–ఆర్డినేటర్ ఎ. విజయరత్నం, సైకాలజీ కౌన్సిలర్లు డాక్టర్ సలోమీ, శంకరీ, శ్రీనాథ్, పద్మావతి, శిరీష, రాజేశ్వరి, హరణి, భాను పాల్గొన్నారు.

సామాజిక తనిఖీ ప్రజా వేదిక



పాల్గొన్న ఎంపీపీ, డ్వామా పీడీ శంకర్, అధికారులు

ఫిరంగిపురం: మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల్లో ఇప్పటి వరకు నిర్వహించిన పలు అభివృద్ధి పనులుపై సామాజిక తనిఖీ బృంద సభ్యులు వివరాలు సేకరించారు. ఆ వివరాలు ప్రజా వేదికలో తెలియజేశారు. 2023 ఏప్రియల్ 1 నుంచి 2024 మార్చి 31 వరకు జరిగిన పనులను సభ్యులు పరిశీలించారు. కొన్ని గ్రామాల్లోని ఉపాధి కూలీలకు జాబ్ కార్డులు అందలేదని చెప్పారు. అదే విధంగా హాజరు పట్టికలో సంతకాలు దిద్దినట్లుగా ఉన్నట్లు గుర్తించామన్నారు. కొన్నిచోట్ల మొక్కలు నాటేందుకు గుంతలు తీసి నాటలేదని తెలిపారు. పనులు నిర్వహించే ప్రదేశంలో వాటి వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయలేదన్నారు. పట్టికల్లో సంబంధిత శాఖ అధికారుల సంతకాలు లేనట్లుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ షేక్ హేలా నర్గీస్, డ్వామా పీడీ శంకర్, ఎంపీడీవో వెంకటేశ్వరరావు, ఏపీడీ శివన్నారాయణ, ఏపీవో జయకుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్దు



ఎస్ఐ సదాశివరావుకు వినతి పత్రం అందజేస్తున్న మహిళలు

ఫిరంగిపురం: నివాస ప్రాంతాల వద్ద మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దంటూ ఫిరంగిపురం గ్రామానికి చెందిన మహిళలు స్థానిక పోలీసు స్టేషన్‌లో సోమవారం వినతిపత్రం అందజేశారు. మహిళలు తెలిపిన వివరాల ప్రకారం.. స్థానిక సొలస బస్టాండు సెంటర్లో ఇటీవల లైసెన్సు తెచ్చుకున్న దుకాణ దారుడు నివాస ప్రాంతాల వద్ద మద్యం దుకాణం ప్రారంభించేందుకు ఏర్పాటు చేస్తున్నాడు. దీంతో విషయం తెలుసుకున్న స్థానిక మహిళలు బస్టాండు సెంటర్లో రద్దీగా ఉంటుందని, స్థానిక పాఠశాల, కళాశాలల్లో చదువుకునే విద్యార్థులు, పలు కుటుంబాలకు ఇబ్బందులు ఎదురవుతాయని వెల్లడించారు. మద్యం దుకాణం ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తుందని చెప్పారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి దుకాణం ఏర్పాటు చేయకుండా నిరోదించాలంటూ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐ సదాశివరావునకు వినతి పత్రం అందజేశారు. వారిలో హేమలతారెడ్డి, సుజాత, ఎం.శివకుమారి, ఎస్కే. నూర, ఎస్‌కే ఫాతిమా, రజని, బుజ్జి, బాయమ్మ, టి.రామమోహన్‌రెడ్డి, టి.హృదయ్‌రెడ్డి ఉన్నారు.

అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు

తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ



ఎండీయూ ఆపరేటర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపాలకృష్ణ

తెనాలిరూరల్: రేషన్ పంపిణీలో అవకతవకలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ ఎండీయూ ఆపరేటర్లను హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం పట్టణ, మండల పరిధిలోని ఎండీయూ ఆపరేటర్లతో సమావేశం నిర్వహించారు. తహసీల్దార్ పాల్గొని రేషన్ పంపిణీపై డీలర్లకు, యండీయూలకు పలు సూచనలు చేశారు. రేషన్ పంపిణీలో అక్రమాలు జరిగితే సహించేది లేదన్నారు. ప్రతి నెల 1వ తేదీ నుండి 15వ తేదీలోగా రేషన్ పంపిణీ పూర్తి చేయాలని సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సక్రమంగా జరిగేలా చూడాలని ఎవరికీ ఇబ్బంది లేకుండా సకాలంలో రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. చిన్న చిన్న ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో వాటిని సరిదిద్దుకోవాలని సూచించారు. మొబైల్ డిస్పెన్సింగ్ యూనిట్ (ఎండీయూ)ల నిర్వాహకులు తమకు అందించిన సరుకులను ఖచ్చితంగా పంపిణీ చేపట్టాలని, తప్పనిసరి పరిస్థితుల్లో ఎండీయూలు అందుబాటులో లేకపోతే డీలర్లు, వీఆర్వోలతో సమన్వయం చేసుకుని రేషన్ పంపిణీ చేయాలని చెప్పారు. ఇటీవల ఓ ఆపరేటర్ పోలీసులకు రేష బియ్యం తరలిస్తూ పట్టుబడ్డాడని, అటువంటి ఘటనలు చోటుచేసుకుంటే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. తాను స్వయంగా రేషన్ పంపిణీని పరిశీలిస్తానని చెప్పారు. పట్టణ, మండల పరిధిలోని ఎండియు ఆపరేటర్లు సీఎస్‌డీటీ మూర్తి పాల్గొన్నారు.

రోడ్లు, మురుగు కాల్వలను నిర్మించండి



తెనాలిఅర్బన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు, మురుగు కాల్వలు లేక ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, వాటిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని పలువురు పట్టణవాసులు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్నను కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహించారు. గానుగ నూనె షాపు నుంచి దుర్వాసన వస్తుందని ఒకరు, మా స్థలంలో మురుగు నీరు నిల్వకుండా చూడాలని మరొకరు ఇలా నాలుగు అర్జీలు వచ్చినట్లు ఆయన తెలిపారు. వీటిని పరిష్కరించే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విధులకు సకాలంలో హాజరుకండి

అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి



తెనాలిఅర్బన్: విధులకు సకాలంలో హాజరు కావాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వి.ఎం.లక్ష్మీపతి సూచించారు. పట్టణంలోని 1వ శానిటరీ డివిజన్ కార్యాలయాన్ని సోమవారం ఆయన తనిఖీ చేశారు. అటెండెన్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణనుసక్రమంగా జరిగే విధంగా చూడాలన్నారు. ప్రజల నుంచి ఎటువంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని తెలిపారు. అనంతరం 9వ డివిజన్‌లో పర్యటించి అక్కడ జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులను పరిశీలించారు. ఆయన వెంట పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com